క్లుప్తంగా

వైఎస్సార్ పింఛనుతో ఆసరా



ఉయ్యూరు: వైఎస్సార్ పింఛను పేదలకు ఆసరాగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. పింఛన్ల పంపిణీ మంగళవారం వేకువజాము నుంచే మొదలైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. పట్టణంలోని 11వ వార్డులో డయాలసిస్ రోగి చిన్నం నాయుడుకు కొత్తగా మంజూరైన డయాలసిస్ పింఛను రూ.10 వేలు అందించారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా సాగింది. పింఛను యాప్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో కొంత జాప్యం తలెత్తినప్పటికీ వలంటీర్లు సమర్థంగా పింఛన్లను అందించారు.

పెదపులిపాక ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీవిజయసుందరేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ పూర్ణిమ సందర్భంగా శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ విజయరాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు వారి గోత్రనామాలతో అభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే వంశీ రైతుల పక్షపాతి



గన్నవరం రూరల్: ఎమ్మెల్యే వంశీ రైతుల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 12మంది రైతులకు ట్రాక్టర్‌లు, 11మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ట్రాక్టర్ ఖరీదు 7లక్షలు ఉండగా ఒక్కో రైతుకు రూ.లక్ష రూపాయలను ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి ఇచ్చారని చెప్పారు. ఎంపీపీ అనగాని రవి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, బాపులపాడు జెడ్పీటీసీ గంగా భవాని, ఎంపీపీ వై. నరేష్, రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ నక్కా గాంధీ, విజయవాడ రూరల్ జెడ్పీటీసీ సువర్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

కంకిపాడు: జయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై ఈడుపుగల్లు–గంగూరు పాసేజ్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బైక్‌లు ఒకదాన్నొకటి ఢీకొనటంతో బైక్‌లపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం... ఈడుపుగల్లు పాసేజ్ వద్ద విజయవాడ వైపు వెళ్తున్న బైక్‌ను అదే మార్గంలో వెళ్తున్న మరో బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఒక మహిళ, ఇద్దరు యువకులు గాయపడ్డారు. బైక్‌లు రెండూ ధ్వంసమయ్యాయి. రోడ్డుపై పడిపోయిన క్షతగాత్రులను వాహనదారులు డివైడర్‌పై కూర్చోబెట్టి వైద్య సహాయం కోసం ప్రైవేటు వాహనాల్లో పంపారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

నీటి వినియోగంపై అవగాహన అవసరం

పెనమలూరు: నీటి వినియోగం–నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పెనమలూరు గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. పెనమలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జల జీవన్ మిషన్ మారుతీ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా సర్పంచి లింగాల భాస్కరరావు మాట్లాడుతూ గ్రామస్తులకు నీటి వినియోగంపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. నీటి విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మహిళా సొసైటీ లీడర్ షేక్ షకీరా పలువురు పాల్గొన్నారు.

మణిపూర్ దమనకాండను అరికట్టాలి



కంకిపాడు: మణిపూర్‌లో జరుగుతున్న దమనకాండను అరికట్టాలని ఆశ వర్కర్స్ యూనియన్ కృష్ణాజిల్లా అధ్యక్షురాలు జి.కుమారి డిమాండ్ చేశారు. యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉప్పలూరు పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలు మంగళవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఝాన్సీ, వి.పార్వతి, సిహెచ్ సంధ్య, కరుణ, గంగ పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు పట్టవా?

- ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపాటు
- రివ్యూ సమావేశంలో సమస్యలపై సుదీర్ఘ చర్చ
- చర్యలకు ఆదేశించిన ఎమ్మెల్యే పార్థసారథి



డ్రెయినేజీ ఈఈ విజయలక్ష్మితో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: రైతుల ఇబ్బందులు పట్టవా? వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనప్పుడు నెల నెలా జీతాలు తీసుకోవటం కోసమా మీరు ఉన్నది?, రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు సమర్థంగా ప్రభుత్వానికి నివేదించండి అని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశించారు. డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖల పనితీరుపై ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్రెయినేజీ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పెనమలూరు నియోజకవర్గ పరిధిలో అధిక వర్షాలకు జరిగిన పంట ముంపు సమస్యపై చర్చించారు. ఫిబ్రవరిలో అంచనాలు రూపొందించి, మార్చిలో టెండర్లు పిలిపించి ఏప్రిల్, మే నాటికి పనులు పూర్తి చేస్తే బావుంటుందని సూచించారు. పనుల గుర్తింపు, అంచనాతోనే కాలయాపన జరిగిపోతుందని, వర్షాలు పడితే పొలాలు ముంపు బారిన పడి రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులకు ఏర్పడుతున్న నష్టానికి అధికారులే బాధ్యులని అన్నారు. జాతీయ రహదారి వెంబడి రోడ్డు విస్తరణ పనులతో డ్రెయినేజీ, ఇరిగేషన్ బోదెలు అస్తవ్యస్తంగా మారాయని, కాలువలు, బోదెలు పూడుకుపోయినా పట్టించుకోవటం లేదన్నారు. సమస్య తలెత్తినప్పుడే కాకుండా ఎప్పటికప్పుడు బోదెలు, కాలువల నిర్వహణ పర్యవేక్షిస్తూ ఆక్రమణల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. మంతెనలో బుడమేరుపై నిర్మించిన ఏళ్ల నాటి బ్రిడ్జి శిథిలమైందని, బ్రిడ్జి అవతలి వైపున ఉన్న 1600 ఎకరాల పంట పొలాలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దానిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డ్రెయినేజీ ఈఈ విజయలక్ష్మికి సూచించారు. ఆమె మాట్లాడుతూ జనవరి వరకూ బుడమేరులో నీటి ప్రవాహం ఉంటుందన్నారు. ఆ తరువాత తగ్గుముఖం పడుతుందని, బ్రిడ్జిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అంచనాలను తయారు చేస్తామన్నారు. తెన్నేరు నుంచి ప్రత్యామ్నాయ మార్గం ఉందని, అవసరమైతే కట్టపై రాకపోకలకు వీలుగా జీఎస్‌పీతో పటిష్టపరిచి వర్షాలు కురిసినా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. జిల్లా, డివిజన్ స్థాయి సమావేశాల్లో నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ కాలువల నిర్వహణపై సమీక్షించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే పార్థసారథి స్పష్టంచేశారు. సమీక్ష సమావేశంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, మంతెన ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, యువజన విభాగం మండల కార్యదర్శి రాజులపాటి శివబ్రహ్మేశ్వరరావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో యూనివర్సిటీ కమిటీ తనిఖీలు



తనిఖీలకు వచ్చిన యూనివర్సిటీ కమిటీ బృందంతో ప్రభుత్వాస్పత్రి న్యూరోసర్జరీ వైద్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ ఏడాది నుంచి న్యూరోసర్జరీ విభాగంలో సూపర్ స్పెషాలిటీ సీట్లకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఇచ్చింది. అయితే ఆ విభాగంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించేందుకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బృందం మంగళవారం పర్యటించింది. అందులో భాగంగా గుంటూరు వైద్య కళాశాల న్యూరోసర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీవీ సత్యనారాయణతో పాటు మరో వైద్యుడు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని న్యూరోసర్జరీ విభాగంలో పీజీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. లెక్చర్ హాల్, లైబ్రరీ, ఆపరేషన్ థియేటర్ వంటి వాటిని తనిఖీ చేశారు. ఆయనకు న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్, డాక్టర్ ఇందుశేఖర్ ఆ విభాగంలో అందిస్తున్న సేవలను వివరించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ ఫ్యాకల్టీ వివరాలను కమిటీ సభ్యులకు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూత అవసరం



పెద్దిరాజులు స్వామికి ఆర్థిక సాయం అందజేస్తున్న లయన్స్ ప్రతినిధి రావి సురేష్‌బాబు

కంకిపాడు: విభిన్న ప్రతిభావంతులకు చేయూత అవసరమని లయన్స్ ప్రతినిధి, ధనేకుల ఇన్‌స్టిట్యూట్ మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ రావి సురేష్ బాబు అన్నారు. గుడ్లవల్లేరు మండలం సింగలూరుకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు నందం పెద్దిరాజులు స్వామి డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుండటంతో రూ.2500 నగదు, బ్రెయిలీ పుస్తకాలు, మందులు మంగళవారం అందించారు. ఈడుపుగల్లు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సురేష్‌బాబు మాట్లాడుతూ పెద్దిరాజులు స్వామికి అవసరమైన వైద్య సేవలు ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో అందిస్తున్నామన్నారు. పోటీ పరీక్షలకు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తుమ్మల కిషోర్, రావి రాజేష్, నెరుసు శివకుమార్, గౌతమ్, నితీష్ పాల్గొన్నారు.

రంచనగా పింఛన్ పంపిణీ



పెనమలూరు 3వ సచివాలయం పరిధిలో వృద్ధునికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ మల్లీశ్వరి



విజయవాడ రూరల్ మండలంలో లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్వేత

పెనమలూరు: వైఎస్సార్ పింఛన్ నగదును లబ్ధిదారులకు మంగళవారం ఉదయాన్నే వలంటీర్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద జూలై నెల పింఛన్ సొమ్ము ప్రభుత్వం సకాలంలో విడుదల చేసింది. పెనమలూరు మండలం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో మొత్తం పింఛన్‌దారులు 17,713 మంది ఉండగా వారికి ప్రభుత్వం రూ.4,93,99,750 మంజూరు చేసి సోమవారం విడుదల చేసింది. ఇందులో తాడిగడప మున్సిపాలిటీలోని 19 వార్డు సచివాలయాల్లో 12,237 మందికి రూ.3,42,02,750, పెనమలూరు మండలంలో 11 గ్రామ సచివాలయాల్లో 5494 మందికి 1,51,97,000 సొమ్ము కేటాయించింది.ఉదయాన్నే సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి పింఛన్ నగదు పంపిణీ చేశారు.

విజయవాడరూరల్: రూరల్ మండలంలో మంగళవారం 66.26 శాతం మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశాకరి ఎంపీడీఓ (ఇన్‌చార్జి) బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. మండలంలో 16,407 పెన్షన్లు ఉండగా వాటిలో మొదటి రోజు 10,893 మంది లబ్ధిదారులకు రూ.3,02,66,250 ద్వారా అందజేశామని పేర్కొన్నారు.

ఉంగుటూరులో 71శాతం పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు: మండలంలోని 16గ్రామ సచివాలయాల పరిధిలో 7,893 మంది పింఛనర్లకు పంపిణీ చేయాల్సి ఉండగా 5,553 మందికి అందజేసి 71శాతం పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. పెద అవుటపల్లిలో పెన్షన్ల పంపిణీని ఎంపీడీవో మంగళవారం పరిశీలించారు. వలంటీర్లకు పలు సూచనలు చేశారు. సచివాలయ గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వర్ణకవచంతో దుర్గమ్మ దర్శనం

- పౌర్ణమి ప్రత్యేక అలంకరణ
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్‌రెడ్డి, పేర్ని కిట్టూకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ మంగళవారం స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పలువురు ప్రముఖులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చనలో పాల్గొన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు నిర్వహించిన పూజలో మంత్రి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి, కృష్ణా, వైఎస్సార్ సీపీ గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అమ్మవారిని దర్శించుకున్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి చండీహోమంలో పాల్గొని పూజలు జరిపించుకొన్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. బ్రో హీరో సాయిధరమ్ తేజ్, చిత్ర దర్శకుడు సముద్రఖని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రముఖులకు వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, దుర్గగుడి డీఈవో గురుప్రసాద్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ తిరుపతమ్మకు ప్రత్యేక పూజలు

గన్నవరం రూరల్: శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానంలో మంగళవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మూను పూజ, లక్ష్మీ సహస్ర నామ పారాయణం, ఖడ్గమాల పారాయణం, హనుమాన్ చాలీసా జరిగాయి. అన్నదానానికి నర్రా సుబ్బారావు, విజయలక్ష్మీ దంపతులు వితరణ చేశారు. ఆలయ కమిటీ భక్తులకు ఏర్పాట్లు చేసింది.

షూటింగ్ పోటీల్లో షణ్ముఖ ప్రతిభ



పెనమలూరు: రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన 23వ రాష్ట్ర స్థాయి పోటీల్లో షణ్ముఖ రిష్యేంద్ర పతకం సాధించాడు. ఈ సందర్భంగా తాడిగడపలోని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో షణ్ముఖరిష్యేంద్రను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎయిర్ రైఫిల్ ఓపెన్ సీనియర్ క్యాటగిరీలో ఉత్తమ ప్రతిభ చాటిన షణ్ముఖ రిష్యేంద్ర రజత పతకం సాధించాడు. కార్యక్రమంలో ర్యాప్ సెక్రటరీ రాజ్‌కుమార్, అకాడమీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, షూటర్‌లు పాల్గొన్నారు.

నేడు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

కంకిపాడు: కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ (టేక్ హోమ్ రేషన్) కార్యక్రమం ఈనెల 2వ తేదీన లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రాజెక్టు సీడీపీఓ కె.బి.సుకన్య తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ లాంఛనంగా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నున్న(విజయవాడరూరల్): తల్లిపాలు పిల్లలకు అమృతంలాంటివని డాక్టర్ భారతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల ప్రారంభోత్సవం మంగళవారం నున్న 3వ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగింది. ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో విలువైన ప్రొటీన్లు, విటమిన్లు అధికంగా ఉంటాయన్నారు. తల్లిపాలు తాగడంతో పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని, పిల్లలు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని పది అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ కోరుతూ విద్యార్థుల ర్యాలీ

గన్నవరంరూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని గన్నవరం కొత్తపేట శ్రీచైతన్య స్కూల్ ఆర్ఐ ధీరేంద్ర అన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం హరితభారత్ ర్యాలీని విద్యార్థులు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్స్ వాడకం తగ్గించాలని, చెట్లను పెంచాలని, కాలుష్యాన్ని నివారించాలని విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఏజీఎం మురళి, కో–ఆర్డినేటర్ భానుకృష్ణ, ప్రిన్సిపాల్ గాయత్రిదేవి, డీన్ పి.శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాల కుట్రలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఉయ్యూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: రాష్ట్రంలో అమలు జరుగుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో సంతోషంగా ఉన్న ప్రజలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక, తమ అనుకూల ప్రచార మాధ్యమాలతో వాస్తవాలను వక్రీకరిస్తూ నీచమైన కుట్రలకు పాల్పడుతున్నాయని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మండిపడ్డారు. ఉయ్యూరు మున్సిపాలిటీలోని 19వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలకు సంక్షేమ బ్రోచర్లను అందించారు. కార్యక్రమంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు గోన మదన్, పైలా శ్రీనివాసరావు, తెనాలి పద్మావతి, రాజులపాటి చిన్ని, కూరాడ వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, నాయకులు నిడుమోలు పూర్ణ, అబ్దుల్ సద్దాం తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట వాసులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: కరకట్ట వాసులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెదపులిపాక గ్రామం కరకట్ట దిగువున ఉన్న శ్రీనగర్‌కాలనీలో రూ.30 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే పార్థసారథి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ దివిసీమ ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పేద, మధ్య తరగతి ప్రజలు కరకట్ట దిగువన నివాసాలు నిర్మాణం చేసుకున్నారన్నారు. శ్రీనగర్, గణపతినగర్ ప్రాంతంలో దాదాపు 3 వేల మంది ఉంటున్నారని అన్నారు. వారికి మౌలిక వసతులు కల్పించి అండగా ఉంటామన్నారు. భవిష్యత్తులో కృష్ణానది వరదనీటికి ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చేయటానికి ఇప్పటికే ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ కరకట్ట దిగువ నివాసితులకు ఇప్పటికే పలు రోడ్ల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు సమస్య ఉందని తెలపటంతో ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. త్వరలో వాటర్ ట్యాంకు పనులు నిర్మాణం పూర్తి చేసి తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఏఈలు నాంచారయ్య, వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమం వైఎస్ జగన్‌తోనే



కాపునాడు మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా నియామకపత్రం అందుకుంటున్న నిర్మల

కంకిపాడు: కాపుల సంక్షేమం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు అన్నారు. పట్టణంలోని అయానా ఫంక్షన్ హాలులో మంగళవారం కాపునాడు అనుబంధ కమిటీల నియామకం నిర్వహించారు. మహిళా విభాగం ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శిగా శెట్టి నిర్మల, యువ కాపునాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెడ్నం ఆనంద్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తిరుపతిరావు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి ఆనాడు మహానేత వైఎస్సార్ పాటుపడ్డారని, ఆయన ఆశయాలను పుణికిపుచ్చుకున్న జననేత, సీఎం వైఎస్ జగన్ కాపులకు అన్ని విధాలా చేయూత అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువ కాపునాడు రాష్ట్ర కార్యదర్శి లింగం రవి, యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.పోసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా సన్నాహక సమావేశం

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో త్వరలో జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 17 సంవత్సరాలు నిండిన వారికి ఆటల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సచివాలయంలో తెలియజేయాలని సూచించారు. మండలంలో కబడ్డీ–12, ఖోఖో–5, క్రికెట్ 6, వాలీబాల్ 12, షటిల్ 2 జట్లు నమోదు చేసుకున్నారని వివరించారు. మండల స్థాయి నుంచి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆటల పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ డి.వనజాక్షి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో పాల్గొనేందుకు ఔత్సాహిక క్రీడాకారులు తమ పేర్లను ఆయా గ్రామ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బాపులపాడు ఎంపీడీవో కంబాల జోగేశ్వరరావు చెప్పారు. మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలపై ఎంఈవో రామ బాలాసింగ్, వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వివరాలకు మండల క్రీడల కోఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావును ఫోన్ నంబర్ 9491735353 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు బీఎస్ రామచంద్రుడు, డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మంగళవారం అత్యంత వైభవోపేతంగా సాగింది. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. దేవస్థాన ప్రచార రథం, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. తొలుత ఆలయ అర్చకులు, వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు ప్రత్యేక వాహనంపై కొలువై ఉన్న ఆది దంపతులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి కొట్టు సత్యనారాయణకు దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. ఆది దంపతులు కొలువై ఉన్న ప్రత్యేక వాహనాన్ని మంత్రి, చైర్మన్, ఈవోలు ముందుకు లాగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ముందుకు సాగింది. గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో నగరంలోని పలు ఆధ్యాత్మిక సంస్థలు, భక్త బృందాలతో పాటు సేవా బృందానికి చెందిన సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దుర్గగుడి నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితార సెంటర్, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావు నగర్, చిట్టినగర్, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపానికి చేరింది. గిరి ప్రదక్షిణలో భాగంగా తమ ప్రాంతానికి విచ్చేసిన ఆది దంపతులకు పలువురు భక్తులు హారతులిచ్చి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకృష్ణ, చింతా సింహాచలం, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమ, ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.